శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## వైసీపీ వైఫల్యాలను ఎండగట్టాలి



**నెల్లూరు అక్టోబర్ 1, ప్రభాతవార్త-వైద్యం** వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ, జగన్ ప్రభుత్వం చేస్తున్న వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని తెలుగుదేశం పార్టీ మాజీమంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని గోమతినగర్‌లో ఉన్న పొంగూరు క్యాంపు కార్యాలయంలో 28 డివిజన్లకు సంబంధించిన టీడీపీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ భవిష్యత్తు గ్యారెంటీ, బాబుతో నేను కార్యక్రమాలు ఏవిధంగా జరుగుతున్నాయో నాయకులను అడిగి తెలుసుకున్నారు. వైసీపీ నేతలు చేస్తున్న అరాచకాలకు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్ళాలన్నారు. వచ్చే ఎన్నికలు నెల్లూరులో రౌడీకి అభివృద్ధి ప్రధాత మధ్య జరుగుతాయన్నారు. అభివృద్ధి ప్రధాతైన నారాయణ ఆ ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధిస్తాడని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపుకోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి భారీ విజయాన్ని సాధించాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ముప్పాళ్ళ విజేతరెడ్డి, నగర అధ్యక్షుడు మామిడాల మధు, కరీముల్లా ఆయా డివిజన్ల నాయకులు పాల్గొన్నారు.

## ఐసీడీయస్ జిల్లా పీడీ కార్యాలయంలో శ్రమదానం



**నెల్లూరుటౌన్, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన నెల్లూరులోని ఐసీడీయస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయంలో ఆదివారం ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.హేమ సుజన ఆధ్వర్యంలో శ్రమదాన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. తనతో పాటు ఐసీపీఎస్ అధికారులు, సిబ్బంది, పీఈ కార్యాలయ సిబ్బంది కార్యాలయ ప్రాంగణంలో శ్రమదానం నిర్వహించి చెత్తను తొలగగించారు. జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలను పురస్కరించుకుని స్వచ్ఛత హై సేవ - 2023 కార్యక్రమంలో భాగంగా ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలో పరిశుభ్రత కోసం ఒక గంట శ్రమదానం, కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాంగణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాజెక్టు డైరెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా బాలసదనం, శిశు గృహ నందు ఈ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో బి.అనురాధ, సిబ్బంది, బాలసదనం సూపరింటెండెంట్ లక్ష్మి భాయి, జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్, బాలసదనం శిశు గృహ, డీసీపీయు సిబ్బంది పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జన కార్యక్రమం



**అల్లూరు, అక్టోబరు 1 ప్రభాతవార్త** వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా అల్లూరు తూర్పు వీధిలోని పాండురంగ దేవస్థానం వద్ద నెలకొల్పిన విఘ్నేశ్వరస్వామికి 13 రోజుల పాటు పూజలు నిర్వహించి శనివారం అర్ధరాత్రి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూలతో విశేష అలంకరణ చేపట్టి విద్యుత్ దీపాలంకరణ, మంగళ వాయిద్యాలు, బాణాసంచా శబ్దాల మధ్య విఘ్నేశ్వరస్వామి గ్రామ పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం నిమజ్జన కార్యక్రమం జరిగింది. స్వామి వారి లడ్డూను వేలం పాటలో ఊటు గోవిందరెడ్డి 60 వేల 116 రూపాయలకు దక్కించుకున్నారు

## ముందు వెళ్తున్న లారీని ఢీకొన్న మరో లారీ...లారీ డ్రైవర్ మృతి



**కావలి రూరల్, అక్టోబరు 1 ప్రభాతవార్త** కావలి మండలం అల్లిగుంటపాలెం బ్రిడ్జి దాటిన తర్వాత జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని వెనుక వస్తున్న మరో లారీ ఢీకొట్టడంతో లారీ డ్రైవర్ లాల్‌షారాజ్‌పుత్(53) బలమైన గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. కావలి రూరల్ పోలీసుల సమాచారం మేరకు కావలి మండలం అల్లిగుంటపాళెం సమీపాన జాతీయ రహదారిపై ఆదివారం నెల్లూరు నుండి ఒంగోలు వైపు వెళ్తున్న లారీని వెనుక వస్తున్న లారీ డ్రైవర్ అతి వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ లాల్‌షారాజ్‌పుత్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు వద్ద జంట జీవన్ క్యాంప్, వాటర్ ట్యాంక్, ఒక్లా ఫ్లేస్-2, ఇండస్ట్రియల్ ఏరియా, సౌత్ న్యూఢిల్లీ అని ఉన్నట్లు తెలిపారు. డ్రైవర్ చనిపోయిన విషయం కావలి రూరల్ మండలం సిరిపురం విఆర్వో కొమరగిరి రాజేష్‌బాబు కావలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో రిపోర్టు ఇచ్చాడు. ఈ రిపోర్టు మేరకు కావలి రూరల్ ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించి మృతుడి బంధువులకు సమాచారం తెలియజేయడం జరిగిందని తెలిపారు.

## అక్రమ తెల్లరాయి తవ్వకాలపై అటవీశాఖాధికారులు దాడులు



**సైదాపురం, అక్టోబరు 1, ప్రభాతవార్త** మర్లపూడి గ్రామ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తెల్లరాయి తవ్వకాలు నిర్వహిస్తున్న వాహనంపై నెల్లూరు అటవీ శాఖ రేంజర్ ఎస్.మాల్యాద్రి తన సిబ్బందితో కలిసి ఆదివారం ఉదయం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఒక జేసీబీ మిషన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా రేంజర్ మాల్యాద్రి మాట్లాడుతూ మర్లపూడి కోమటిగుంట రాజుపాలెం గ్రామ సమీపంలో ఉన్న అటవీ భూముల్లో కొంత మంది వ్యక్తులు యంత్రాలతో అక్రమ తెల్లరాయి తవ్వకాలు నిర్వహిస్తున్నారన్న పక్కా సమాచారం రావడంతో జిల్లా అటవీ శాఖాధికారి ఆవుల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించడం జరిగిందని ఈ దాడుల్లో ఒక జేసీబీని స్వాధీన పరుచుకున్నామని తెలిపారు. సైదాపురం మండలంలో ఎవరైనా అటవీ ప్రాంతంలోకి ప్రవేశించి యంత్రాలతో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ తెల్లరాయి తవ్వకాలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్ఎస్‌వో అమీనయ్య, ఎఫ్‌బీఓ కాశీం, రవిశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ఇరువర్గాలపై కేసులు నమోదు

**కావలి రూరల్, అక్టోబరు 1 ప్రభాతవార్త** తమపై కావలి టిడిపి కార్యాలయంలో కొంతమంది దాడి చేసి కులం పేరుతో దూషించారని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబురావు, అతని అనుచరులు దాసరి, సునీల్, నాగేంద్రబాబులు ఫిర్యాదు చేశారు.ఈ ఫిర్యాదు మేరకు మలిశెట్టి విజయలక్ష్మి, రహీం, లింగం మాల్యాద్రి, రామయ్య, జంపాని వరప్రసాద్, మహేష్ కావేటి శివకుమార్‌లపై హత్యాయత్నం, కులదూషణకు సంబంధించిన కేసులు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. అలాగే శెట్టిపల్లి మనోహర్ తనపై బొట్లగుంట శ్రీహరినాయుడు, సింగమనేని హరిబాబు, చిత్తాబత్తిన మాల్యాద్రి, నారాయణ, అరటితోట జ్యోతిబాబురావులు కర్రలతో దాడి చేసి కుల దూషణ చేశారని ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# అవినీతిని సమర్ధిస్తున్న టీడీపీ: మంత్రి కాకాణి



**నెల్లూరు సిటీ, అక్టోబరు 1, ప్రభాతవార్త:** అవినీతి ఆరోపణలతో మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు కావడాన్ని ఖండిస్తూ పరోక్షంగా టీడీపీ అవినీతిని సమర్ధిస్తోందని మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. నెల్లూరు వైసీపీ జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్కిల్ స్కామ్‌లో రూ.371 కోట్ల అడ్డగోలు దోపిడికి పాల్పడి చంద్రబాబు అడ్డంగా దొరికిపోయారన్నారు. రూ.80కోట్ల ఖర్చుతో ఏర్పాటైన సెంటర్‌లో పరికరాల విలువ రూ.2కోట్ల రూపాయలుగా చూపించారన్న వాస్తం బయటపడిందన్నారు. రాష్ట్రంలో 42 స్కిల్ సెంటర్లలో ఎక్కడా పరికరాలకు ఇన్‌వాయిస్‌ల్లేవన్నారు. చంద్రబాబు నేరాన్ని సమర్ధిస్తూ టీడీపీ ఈ రాష్ట్రంలో అవసరమైన రాద్ధాంతాలకు పాల్పడుతున్న నేపథ్యంలో వాస్తవాల్ని ప్రజలకు తెలియపరచాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. స్కిల్ డవలప్‌మెంట్ స్కామ్ జరిగిన మాట వాస్తవమేనని చంద్రబాబు పాత్ర పరిమితమని టీడీపీ నేతలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజలు వ్యవహారం మొత్తాన్ని గమనిస్తూనే ఉన్నారన్నారు. విక్రమ సింహపురి యూనివర్సిటీ స్కిల్ సెంటర్‌లో ప్రెస్‌మీట్ పెట్టినంతమాత్రాన వాస్తవాలు అవాస్తవాలు అయిపోవని అన్నారు. అక్కడున్న ల్యాబ్ పరికరాలను సీమెన్స్ సంస్థకు సంబంధమే లేదని ఆధారాల్ని చూపించామని తెలిపారు. 2017 జూన్ 30న ప్రభుత్వ జీవో నెంబరు 4 ప్రకారం సీమెన్స్ ఇండస్ట్రీస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ నకిలీ కంపెనీ పేరుతో స్కామ్ చేశారన్నారు. ఒక్కో సెంటర్‌కు రూ.80కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉండగా కేలం రూ.10 కోట్లే ఎంటీ అని ప్రశ్నించారు. మిగతా రూ.70కోట్లు ఎవరి ఖాతాల్లోకి చేరాయో సమాధానం చెప్పాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పేరున్న సీమెన్స్‌కు టీడీపీ నేతలు చెబుతున్న సీమెన్స్ ఇండస్ట్రీస్ సాఫ్ట్‌వేర్‌కు పోలికలేదన్నారు. అవాస్తవాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అవినీతి సక్రమం.. అరెస్టు మాత్రం అక్రమం అనేది చంద్రబాబు భార్య, కోడలు ఇస్తున్న సందేశమా అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ఎందరో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామంటూ మోసం చేసిన వ్యక్తి చంద్రబాబుకు సంఘీభావంగా ప్రజల్ని కంచాలు మోగించమనడం, ఈలలు, డోళ్లు అంటూ వికృత చేష్టలకు పురిగొల్పడం తగదన్నారు. అవినీతి నింద నుంచి తండ్రిని కాపాడాలనే తాపత్రయంలో కొడుకు లోకేష్ ఢిల్లీకి వెళ్లాడన్నారు. అమరావతి ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ స్కామ్‌లో లోకేష్ నిందితుడు కాబట్టే పారిపోయి దాక్కున్నారని ఆరోపించారు. చంద్రబాబు రాజకీయ జీవితాన్ని నిమజ్జనం చేసేందుకు టీడీపీ నేతలు పూనుకున్నారేమోననిపిస్తుందని ఎద్దేవ చేశారు.

# పరిశుభ్రత పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలి



**నెల్లూరు సిటీ, అక్టోబరు 1, ప్రభాతవార్త** శారీరక శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని ఎంపీలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు సూచించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఏర్పాటు చేసి 9 ఏళ్ల పూర్తి అయిన సందర్భంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గం శ్రీఇరుకలల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం సమీపంలోని గణేష్ ఘాట్ దగ్గర ఏక్ తారీఖ్ ఏక్ గంట శ్రమదాన్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి, నగర కమీషనర్ వికాస్ మర్మత్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని 2014 ఆగష్టు 15వ తేదీన ప్రధానమంత్రి ప్రారంభించారని ఏటా నూతన కార్యక్రమం చేపడుతూ ప్రతి ఇంటికి మరుగుదొడ్లు నిర్మించే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం నిర్విఘ్నంగా నిర్వహించుకుంటున్నామన్నారు. ప్రధానమంత్రి సూచనలతో అక్టోబరు 1వ తేదీ ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పారిశుధ్య కార్మికులను మనస్పూర్తిగా అభినందించి గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని ఎంపీ ఆదాల సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నగర డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్‌కుమార్ యాదవ్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్ ఎదుట మహిళ నిరసన



**వింజమూరు, సెప్టెంబర్30ప్రభాతవార్త :** వింజమూరు పోలీస్‌స్టేషన్ ఎదుట రహదారిపై ఆదివారం సుజాతనగర్‌కు చెందిన షేక్ నస్రిన్ తన చంటి బిడ్డతో పోలీసులు న్యాయం చేయాలంటూ బైఠాయించి నిరసనకు దిగింది. నస్రిన్ తన భర్తనుండి 3సంవత్సరాల క్రితం విడిపోయి సుజాతనగర్‌లోని తన అత్త ఇంట్లోనే నివాసం ఉంటుంది. నాలుగురోజుల క్రితం భర్త ముజీబ్ వారి కుటుంబసభ్యులు నసిన్ లేని సమయంలో ఇంటికి వచ్చి ఆమె ఉంటున్న ఇంటి రేకులను పగులగొట్టి ఇంట్లోని సామాను బయటవేసి వెళ్ళారని ఆమె తెలిపారు. దాంతో పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోనందునే తాను బిడ్డతోసహా ఆందోళనకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆమె పేర్కొన్నారు. ఈవిషయమై ఎస్ఐ కోటిరెడ్డి మాట్లాడుతూ నస్రిమ్‌కు తన భర్తకు గతంలో వివాదాలున్న నేపద్యంలో ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి కోర్టుకు పంపామన్నారు.ఇటీవల జరిగిన ఇంటి విధ్వంసంపై నస్రిమ్ భర్త, కుటుంబసభ్యులను స్టేషన్‌కు పిలిపించి హెచ్చరించామన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ తెలిపారు. దాంతో ఆ మహిళ ఆందోళన విరమించింది.

# దొంతాలిలో పలు అభివృద్ది కార్యక్రమాలు




**నెల్లూరు సిటీ, అక్టోబరు 1, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ దొంతాలి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు జిల్లా వైసీపీ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి శంకుస్థాపనలు చేశారు. బాణసంచా, మేళతాళాలతో గ్రామస్తులు ఇరువురు ఎంపీలకు ఘన స్వాగతం పలికారు. శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. అనంతరం రూ.4.50కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దొంతాలి గ్రామంలో నూతన రోడ్ల నిర్మాణ శంకుస్థాపన కావడం సంతోషంగా ఉందన్నారు. సుమారు రూ.4.50కోట్ల రూపాయలతో ఈ నిర్మాణ పనులు చేపట్టడం గొప్ప విషయమని తెలిపారు. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి రూరల్‌ను అభివృద్ధి చేసేందుకు ఆదాల నిరంతరం శ్రమిస్తున్నారని ఎంపీ వేమిరెడ్డి కొనియాడారు. 7 నెలల కాలంలోనే సుమారు 100 కోట్ల రూపాయలు అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ప్రస్తుతం రూరల్ నియోజకవర్గం ప్రశాంతంగా ఉందని, ఎవరి పనులు వారు చేసుకుంటున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆదాల, నెల్లూరు రూరల్ స్థానానికి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారని, తాను ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్నాని గతం కంటే అధిక మెజార్టీతో తనను గెలిపించి ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. సందర్భంగా గ్రామస్తులు చెరువు పూడిక, తూముల సమస్యపై ఎంపీ వేమిరెడ్డి దృష్టికి తీసుకురావడంతో స్పందించిన తన వంతుగా రూ.15లక్షలు సాయం అందిస్తానని హామీ ఇచ్చారు.దాంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అక్టోబరు 20వ తేదీన గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని గ్రామస్తులు అందరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరం అయిన వారికి ఆపరేషన్లు చేస్తారని, ప్రతి ఒక్కరూ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పలువురు రైతులకు పట్టా పాసు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ పి.స్రవంతి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, ఎంపీపీ, ఎంపీటీసీ, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పెరుమాళ్లపాడులో అక్రమ తవ్వకాలు.. వాహనాలు సీజ్ చేసిన పోలీసులు





**సైదాపురం, అక్టోంబరు 1, ప్రభాతవార్త** మండల పరిధిలోని పెరుమాళ్లపాడు గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూముల్లో అక్రమంగా తెల్లరాయి తవ్వకాలు నిర్వహిస్తున్న వాహనాలపై సైదాపురం ఎస్సై చల్లా వాసు ఆయన సిబ్బందితో కలిసి దాడులు చేసి రెండు ఇటాచి మిషన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

ఈ సందర్భంగా ఎస్సై చల్లా వాసు మాట్లాడుతూ పెరుమాళ్లపాడు గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూముల్లో కొంత మంది వ్యక్తులు అక్రమంగా యంత్రాలతో తెల్లరాయి తవ్వకాలు నిర్వహిస్తున్నారని, సమాచారం రావడంతో తన సిబ్బందితో కలిసి ఆదివారం ఉదయం దాడులు నిర్వహించి రెండు ఇటాచి మిషన్‌లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. మండలంలో ప్రభుత్వ పట్టా భూముల్లో ఎటువంటి అనుమతులు లేకుండా యంత్రాల సహాయంతో ఖనిజ సంపద తవ్వకాలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

## ఎన్‌సిసి విద్యార్థులచే పరిసరాల పరిశుభ్రత



కలువాయి అక్టోబర్ 1 ప్రభాతవార్త స్వచ్ఛ పక్వాడ లో భాగంగా 24 వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీ సర్ లెఫ్టినెంట్ కల్నల్ సునీల్‌కుమార్ ఆదేశాల మేరకు బివిఎస్ఆర్ జెడిపి హైస్కూల్ అసోసియేట్ ఎన్‌సిపి ఆఫీసర్ జి .పెంచలపుల్లయ్య ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీలో పరిసరాల పరిశుభ్రత ,ప్లా స్టిక్ వాడకూడదని చెట్లు విరివిగా పెంచాలని ఆయన కోరారు.బహిరంగ మలమూత్ర విసర్జన చేయకూడదని తదితర అంశాలపై స్లోగన్ రూపంలో వివరించారు. బస్టాండ్ నందు మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేయించారు. 96 మంది ఎన్‌సిసి విద్యార్థులు పరిసరాలను శుభ్రం చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే అంటువ్యాదులు,మలేరియా,డెంగ్యూ, స్వైన్‌ఫ్లూ వంటి వాటిని అరికట్టవచ్చునని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు స్కూల్ మొత్తం పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేశారు.

## విజేత స్కూల్ ఆధ్వర్యంలో స్వచ్ఛతహిసేవ



**పొదలకూరు అక్టోబర్ 1 ప్రభాతవార్త** పట్టణంలోని రామమందిరం వీధి వద్ద ఉన్న విజేత ఇంగ్లీషు మీడి యం ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛతహిసేవ కార్యక్ర మాన్ని ఆ పాఠశాల విద్యార్థులు,ఉపాధ్యాయులు ఆధ్వ ర్యంలో శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతి పిత మహాత్మాగాంధీకి నివాళులో భాగంగా ఆయనను స్మరించుకుంటు ఒక గంట శ్రమదానం చేపట్టామని వి జేత స్కూల్ ప్రధానోపాధ్యాయులు స్వప్నరెడ్డి పేర్కొ న్నారు.స్వచ్ఛమైన, పచ్చదనం,ప్లాస్టిక్ రహిత భారత దేశాన్ని రూపొందించడంలో ప్రతి ఒక్కరు ఒ చిన్నపాత్ర పోషించాలని వారు కోరారు.అన్ని స్వచ్ఛంధ సంస్థలు పాఠశాలలు కళాశాలలు సామాజికి సాంస్కృతిక రాజ కీయ నాయకులు ప్రభుత్వ అధికారుల భాగస్వామ్యం తో మన పంచాయితీలో ఈకార్యక్రమాన్ని విజయ వంతంచేస్తామన్నారు.

## స్వర్ణోత్సవ వేడుకలకు తరలిన యూటిఎఫ్ నేతలు



**వరికుంటపాడు,అక్టోబర్ 1,ప్రభాతవార్త** : ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవ వేడకలకు వరి కుంటపాడు మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎల్ వి నారాయణ,సుబ్రమణ్యం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలివెళ్ళారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూటిఎఫ్‌ను స్థాపించి49 సంవత్సరాలు అయి నది అనీ,అనేక పోరాటాలు చేసి,ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఘనత యూటిఎఫ్ కే దక్కుతుందన్నారు.ఈ కార్యక్రమములో యూటిఎఫ్ నేతలు షేక్ కరిముల్లా ,వెంకటేశ్వర్లు ,ఎల్‌వి రమణ య్య,డి.వెంకటేశ్వరరావు,హరిశ్చంద్రప్రసాద్ ,రవూఫ్,వి.వెంకటేశ్వర్లు ఎన్ రాజేంద్ర,చంద్రమౌళి ,పి.రాధా కృష్ణ,పి.మనోహర్,కె.గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## సమాజ శ్రేయస్సులో వృద్దుల పాత్ర కీలకం



**వరికుంటపాడు,అక్టోబర్ 1,ప్రభాతవార్త** : సమాజ శ్రేయస్సులో వృద్దులు చాలా కీలక పాత్ర వహిసా ్తరనీ,వారినీ తప్పక ప్రతి ఒక్కరూ గౌరవించాలనీ తహశీల్దార్ నేలపాటి మల్లికార్జున అన్నారు.జాతీయ వృద్దుల దినోత్సవం సందర్భంగా స్థానిక కార్యాలయంలో మండలంలోని వివిధ రకాలుగా సమాజ సేవలో ఉన్న వృద్దులను దుశాలవతో,పూలమాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా తహశీల్దార్ నేలపాటి మలి ్లకార్జున మాట్లాడుతూ వృద్దుల పట్ల నిరాదరణ తగ్గించేదుకు,వారి నుంచి సమాజం నేర్చుకోవాల్సి న అను భవ పాఠాలను అందరూ తెలుసుకోవాల్సి న అవసరం ఎంతైన ఉందన్నారు.ఈ కార్యక్రమములో డిప్యూటి తహశీల్ధార్ నర్సా రెడ్డి,విఆర్‌ఓ శేషారెడ్డి,సర్వేయర్ రేణుక ,విఆర్‌ఎ మల్లి తదితరులు పాల్గొన్నారు.

## మహిళల్ని దూషించలేదని కలుగోళమ్మ తల్లిపై ప్రమాణం చేసిన జ్యోతిబాబురావు



**కావలి, అక్టోబరు 1 ప్రభాతవార్త** మహిళల్ని దూషించలేదని కావలి గ్రామదేవత శ్రీ కళుగోళమ్మ తల్లి ఆలయంలో ఆదివారం టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబురావు ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా జ్యోతిబాబురావు మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్ నుండి కాపాడాలని కావలి తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కళుగోళమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించే క్రమంలో తాను మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు కొందరు ప్రచారం చేస్తున్నారన్నారు. దీంతో తాను అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయలేదని కళుగోళమ్మ తల్లిపై ప్రమాణం చేయడం జరిగిందన్నారు. తాను మహిళలను దూషించి వుంటే అమ్మవారు నన్ను శిక్షిస్తుందన్నారు. లేకుంటే రాజకీయ లబ్ది కోసం కొందరు చేసిన ఆరోపణలు అవాస్తవమని అదంతా అమ్మ వారు చూసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## అల్లూరులో స్వచ్ఛతా సేవా కార్యక్రమం



అల్లూరు, అక్టోబరు 1 ప్రభాతవార్త అల్లూరు నగర పంచాయతీ పరిధిలో స్వచ్ఛతా సేవా ఏక్ తారిక్ ఏక్ గంటా కార్యక్రమంలో భాగంగా ఆదివారం కమిషనర్ ఫణికుమార్ ఆధ్వర్యంలో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో 60 ప్రదేశాలలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టడం జరిగిందన్నారు. రామకృష్ణ కళాశాల నుండి బస్టాండ్ సెంటర్ వరకు స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా ఎంపిడివో కార్యాలయం నందు ఎంపిపి దర్శిగుంట శశిరేఖ, ఎంపిడివో శ్రీదేవిల ఆధ్వర్యంలో కార్యాలయ ప్రాంగణంలో శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రపరిచి అనంతరం ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఇవోపిఆర్‌డి పెంచల వీరేంద్ర, అసిస్టెంట్ ఇంజనీర్ వినోద్‌కుమార్, కార్యాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## బాపూజి అడుగుజాడల్లో అందరం నడుద్దాం

మర్రిపాడు,సెప్టెంబర్30ప్రభాతవార్త : సత్యం, అహింసా మార్గాలతో ఎంతటి మహాయుద్ధంలోనైనా గెలువవచ్చని నిరూపించిన మహాత్మాగాంధీ అడుగుజాడల్లో అందరం నడుద్దామని ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నాటి గాంధీజయంతిని పురస్కరించుకొని విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశ బానిససంకెళ్ళ విముక్తికోసం గాంధీజీ అహింసామార్గంలో చేసిన కృషిని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. గ్రామస్వపరిపాలన కోసం ఆనాడే నాంది పలికిన గాంధీజీ అడుగుజాడల్లో స్వాతంత్ర్యభారతంలో ఎవరూ ప్రయత్నించలేదన్నారు. కానీ మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గామాల్లోనే ప్రభుత్వం ద్వారా అన్ని అవకాశాలు కల్పించి ప్రజలను గ్రామస్వపరిపాలన వైపు అడుగులు వేయిస్తున్నారని విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. భారతజాతి ముద్దుబిడ్డ మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ ఆయన నేర్పిన జీవితసత్యాల వపు నడుస్తూ భావిభారత పౌరులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

## స్వచ్ఛతాహి సేవలో అదానీ పాఠశాలల విద్యార్థులు




**నెల్లూరు,అక్టోబరు1 ప్రభాతవార్త-విద్య** స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాల్లో భాగంగా ముత్తుకూరు కృష్ణపట్నం లోని ఆదాని వరల్డ్ స్కూల్ విద్యార్థులు, అదాని సైనిక్ స్కూల్ విద్యార్థులు ఆదివారం నగరంలోని స్థానిక విఆర్‌సి సెంటర్ నుండి ఆర్టీసీ ప్రధాన బస్టాండ్ వరకు భారీ ర్యాలని నిర్వహించారు. అనంతరం నగరంలోని అనేక వీదులను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా అధాని స్కూల్ ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ మాట్లాడుతు సెప్టెంబరు15నుండి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతాహి సేవా ప్రచారంలో భాగంగా తాము ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. చెత్త రహిత భారతదేశాన్ని రానున్న తరాల వారికి బహుమతిగా ఇవ్వాలన్నారు. తమ విద్యార్థులు స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. అలాగే పుర ప్రజలకు చెత్త మేనేజ్‌మెంట్‌పై అవగాహక కల్పించటం జరిగిందన్నారు. చెత్త రహిత సమాజాన్ని నిర్మించటమే జాతిపిత మహాత్మాగాంధీమి మనమిచ్చే అపురూపమైన నివాళి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధాని సైనిక్ స్కూల్, అధాని వరల్డ్ స్కూల్,అధాని విద్యామందిర్ విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు బాటలోనే మాజీ మంత్రి నారాయణ



**నెల్లూరు సిటీ, అక్టోబరు 1, ప్రభాతవార్త** మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబా బునా యుడు చూపిన బాటలోనే మాజీ మంత్రి నారా యణ నడుస్తున్నారని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ విమర్శిం చారు. నెల్లూరు విజయమహల్ గేటు సమీపం లోని ఎంసీపీ కళ్యాణ మండపంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ పేదల పేరుతో వందల కోట్ల రూపాయల విలువ చేసే భూములను దోపిడి చేశారన్నారు. జైల్లో ఉన్న చంద్రబాబును మాజీ మంత్రి నారాయణ ఎందుకు కలిశారో అర్ధం కావడం లేదన్నారు. మార్గ నిర్దేశం కోసమే చంద్రబాబును కలిశారని విమర్శించారు. మాజీ మంత్రి నారాయణ సైతం అరెస్టు అవుతారన్నారు. పేదల నుంచి అధిక ఫీజులు వసూళ్లు చేసి నారాయణ నీతి మాటలు చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఒకప్పుడు ముద్రగడను ఇబ్బంది పెట్టిన వాళ్లు నేడు అదే పరిస్థితిలో ఉన్నారన్నారు. చంద్రబాబునాయుడు అరెస్టు కావడంపై నెల్లూరు టీడీపీ నేతల్లో ఆందోళన కంటే ఆనందమే కనపడుతోందని ఎద్దేవ చేశారు. తన పరిస్థితి ఏమిటో అర్ధం కాని అయోమయ స్థితిలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆందోళన చెందుతున్నారన్నారు. చంద్రబాబు అరెస్టు అయిన రోజు నుంచి నారా లోకేష్ ఢిల్లీలోనే ఉండటం టీడీపీ నేతలకు అర్ధం కావడం లేదన్నారు. ప్రజల సంక్షేమం కోసమే వైసీపీ ప్రభుత్వం అడుగులు వేస్తుందని తెలిపారు. ఇచ్చిన హామీలకు మించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రతి పౌరుడికి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేందుకు ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభు త్వం ప్రారంభించిందని తెలిపారు. ఏఎన్‌ఎంలు ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలను తెలు సుకుంటున్నారన్నారు. అవసరమైన వారికి వైద్య సేవలను అందిస్తారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే కోటి గడపలకు వాలంటీర్లు, ఏఎన్‌ఎంలు, స్థానిక నేతలు వెళ్లి ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. నగర నియోజకవర్గంలో రూ.10కోట్ల రూపాయలతో నూతన అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేసి వైద్యులనునియమించడంతో పాటు, వైద్యపరీక్షలు నిర్వహించేందుకు పరికరాలను ఏర్పాటు చేస్తున్నామ న్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మరింత వేగంగా సమర్ధవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు.

## ఘనంగా విజయడైరీ చైర్మన్ రంగారెడ్డి జన్మదిన వేడుకలు



**నెల్లూరు సిటీ, అక్టోబరు 1, ప్రభాతవార్త** విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి జన్మదిన వేడుకలు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డ కార్యాలయంలో అభిమానుల మధ్య ఘనంగా జరిగాయి. భారీ సంఖ్యలో అభిమానులు హాజరై రంగారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ తమ ఆత్మీయతను పంచుకున్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ఏపీఆర్ అభిమానులు హాజరై భారీ కేక్ కట్ చేశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించారు. తమ అభిమాన నేత రంగారెడ్డి భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆయురారోగ్యాలతో మరెన్నో పుట్టిన రోజు వేడుకలు నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు.

## 13వ డివిజన్లో అత్యాధునిక పార్కు



**నెల్లూరు సిటీ, అక్టోబరు1, ప్రభాతవార్త** నెల్లూరు సిటీ 13వ డివిజన్ కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున ఆధ్వర్యంలో బాలాజీ నగర్ గ్యాస్ గోడౌన్ సమీపంలో రూ.1.40కోట్లతో నాలుగు పార్కులకు నగర శాసనసభ్యులు డాక్టర్ పి.అనిల్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నాలుగు పార్కుల నిర్మాణంతో నగర నియోజకవర్గంలో వంద శాతం పార్కులు పూర్తి అవుతాయన్నారు. ఎన్నికల కోసం హడావిడిగా అరకొర పనులు కాకుండా శాశ్వతమైన అభివృద్ధి చేసి చూపిస్తామని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా తమ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని తెలిపారు. 13వ డివిజన్‌లో అత్యాధునిక శైలిలో చిన్నారుల కోసం పార్కును నిర్మిస్తున్నామన్నారు. క్రికెట్, టెన్నీస్ కోర్టులను ఏర్పాటు చేస్తామన్నారు. శిక్షణ కోసం ప్రత్యేకంగా కోచ్‌ను నియమిస్తామన్నారు. డివిజన్ పరిధిలో యనమల వారి దిన్నె, బలిజపాలెం ప్రాంతాల్లో ఇప్పటికే పార్కుల నిర్మాణం పూర్తి చేశామని మిట్టపాలెంలో పార్కు నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. తాము చేస్తున్న అభివృద్ధిపై చర్చకు సిద్ధమని ప్రతిపక్ష నేతలకు తేల్చి చెప్పారు.ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కామాక్షితాయి సన్నిధిలో స్వచ్ఛతహిసేవ



బుచ్చి అక్టోబర్ 1 ప్రభాతవార్త పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సన్నిధిలో స్వచ్ఛతహిసేవ-పరిసరాల పరిశుభ్రత కోసం చేతులు కలుపుదాం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10 గంటల నుండి ఆలయ చైర్మన్ పుట్టాసుబ్రమణ్యంనాయుడు, దేవస్దాన కార్యనిర్వహణాధికారి విరుపార్ముల గిరికృష్ణ పాలక మంబలి సభ్యులు, అర్చకులు దేవస్దానం సిబ్బంది దేవస్దానం ప్రాంగణం, స్నానఘాట్,కార్యాలయం అన్ని ముఖ్యమైన ప్రదేశాలలో చెత్తను తొలగించారు.

## సర్దార్ కిర్మానికి డాక్టరేట్ ప్రదానం



**కావలి రూరల్, అక్టోబరు 1 ప్రభాతవార్త** కావలి పట్టణానికి చెందిన ముస్లిం నేత కిర్మాణి సర్దార్ హుస్సేన్ చేస్తున్న సామాజిక సేవలు గుర్తించి తెలంగాణా రాష్ట్రం వరంగల్ జిల్లా హనుమకొండ హోటల్ శ్రేయలో జరి గిన కార్యక్రమంలో నవనిర్మాణ ప్రజా సంక్షేమ సమితి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసి ఘనంగా సత్క రించారు. ఐఎస్ లక్కావజ్జుల విజయ సుబ్రమణ్య సిద్దాంతి, విశ్వజ్యోతి విజ్ఞాన సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ విశ్వనాథ్, ప్రముఖ జ్యోతిష్య పండితులు నంది అవార్డు గ్రహీత డాక్టర్ చక్రధర్ సిద్దాంతిలు ఈ అవార్డును కిర్మాణి సర్దార్‌కు ప్రదానం చేశారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా కిర్మాణి సర్దార్ మాట్లాడుతూ ఈ డాక్టరేట్ తనలో మరింత బాధ్యత పెంచిందన్నారు. సామాజిక కార్యక్రమాలు అంటే తనకు ఎంతో ఎక్కువ మక్కువ అని తెలిపారు. నా సేవలను గుర్తించి తనకు డాక్టరేట్ ఇచ్చి సత్కరించిన నవనిర్మాణ ప్రజా సంక్షేమ సమితి వారికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో కూడా సేవే పరమావధిగా భావించి తాను సామాజిక సేవకు అంకితమవుతానని తెలిపారు.

## రక్తదానం దయార్ధహృదయానికి చిహ్నం



**కావలి రూరల్, అక్టోబరు 1 ప్రభాతవార్త** స్వచ్ఛంద రక్తదానం సాటి మనిషిపై ప్రేమకు, దయార్ధహృ దయా నికి చిహ్నమని రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ దామిశెట్టి సుధీర్‌నాయుడు తెలిపారు. కావలి రెడ్‌క్రాస్ భవనంలో జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాలను ఆదివారం జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. భారతదేశంలో రక్తమార్పిడి చికిత్స పితామహులు డాక్టర్ జయగోపాల్ జోలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిం చారు.ఈ సందర్భంగా కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి.రవిప్రకాష్ మాట్లాడుతూ డాక్టర్ జయగోపాల్ జోలీ జన్మ దినాన్ని 1975 నుండి జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినంగా ప్రభుత్వ,ప్రభుత్వేతర సంస్థలు పాటిస్తున్నట్లు తెలిపారు. కావలి రెడ్‌క్రాస్, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నెల రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు, విద్యార్థులకు పోటీలు, రక్తదాతల అభినందన కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఖాజీ, మదీనా మసీదు నిర్వాహకులు డాక్టర్ సయ్యద్ ఖలీల్ అహ్మద్, కావలి రెడ్‌క్రాస్ కోశాధికారి కలికి శ్రీహరిరెడ్డి, రెడ్‌క్రాస్ పోషక సభ్యులు బుర్లా రఘుకుమార్‌రెడ్డి, ఒరుగంటి వెంకటేశ్వర్లు, కొండాపురం మండల రెడ్‌క్రాస్ కన్వీనర్ తాడికొండ నవీన్, జూనియర్ రెడ్‌క్రాస్ కన్వీనర్ ఎ.వి.హనుమకుమార్, యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ పి.వి.సాయితేజ, టీం సేవియర్స్ అధ్యక్షుడు ప్రణీత్,కీర్తిప్రియ, మనిష్, రమణ్ సుందర్, తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛభారత్ అభియాన్



**రాపూరు,అక్టోబరు1ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరులోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమాన్ని భారతీయ జనతా పార్టీ వెంకటగిరి నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఎస్.ఎస్.ఆర్ నాయుడు నిర్వహించారు. ఇందులోబాగంగా ఆయనతో పాటు పార్టీ నాయకులు,కార్యకర్తలు ఆసుపత్రి ఆవరణను శుభ్రపరిచి పిచ్చిమొక్కలను తోలగించారు.అనంతరం ఆసుపత్రి ఆవరణలో తైవాన్ జామచెట్లను నాటారు. ఈ సందర్భంగా ఎస్.ఎస్.ఆర్ నాయుడు మాట్లాడుతూస్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని భారత ప్రధాని నరేంద్ర మోడీ 2014 అక్టోబర్ నెల 2వ తేది ప్రారంబించడం జరిగిందన్నారు.ఢిల్లీ నుండి గల్లీ వరకు నేడు గ్రామాలు,పట్టణాలు పరిశుభ్రంగా వున్నాయంటే అందుకు కారణం స్వచ్ఛభారత్ అని తెలిపారు,రూ.15 వేలు ఇచ్చి మరుగుదోడ్లు నిర్మించుకోవాలని చెప్పిన ఏకైక ప్రధాని నరేంద్ర మోడి అన్నారు. జన్‌ధన్ అకౌంట్,ప్రధాన మంత్రి ప్రమాద బీమా, జీవన జ్యోతి భీమా,అటల్ జీ పెన్సన్, బేటీ బచావో బేటి పడావో కార్యక్రమంలో బాగంగాసకన్య సమృద్ధి యోజన పథకం, గ్రామీణ ప్రాంతాలకు పిఎంజిఎస్‌వై, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్, నాబార్డ్, ఎంజిఎన్ఆర్ఇఎస్,ఏఐబి వంటి అనేక పథకాలను ప్రవేశ పెట్టి ప్రజలకు లబ్ధీ చేకూర్చడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్‌నాయుడుతో పాటు రాపూరు మండల బిజెపి అధ్యక్షుడు దూడల పెంచలయ్య, పెద్ద ఎత్తున బిజేపి నాయకులు, పార్టీ కార్యకర్తలు,ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది వున్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా వుంచుకోవడం ప్రతి ఒక్కరి భాద్యత



**రాపూరు,అక్టోబరు1ప్రభాతవార్త** పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవడం ప్రతి ఒక్కరి భాద్యత అని రాపూరు పంచాయితీ కార్యనిర్వహణాధికారిశ్రీనివాసులు తెలిపారు. ఆదివారం రాపూరు బిట్ 1 సచివాలయం పరిధిలో పంచాయితీ పారిశుద్య సిబ్బంది,గ్రామవాలంటీర్లతో కలసి ఆయన స్వచ్ఛ భారత్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పట్టణంలో ర్యాలీ చేస్తూ దుకాణదారులు, గృహస్తులు తప్పని సరిగా చెత్తను పంచాయితీ ట్రాక్టర్ వచ్చినప్పుడు ట్రాక్టర్‌లోనే వేయాలని లేని పక్షంలోపంచాయితీ వారు ఏర్పాటు చేసిన కుప్పతోట్టిలలో మాత్రమే చెత్తను వేయాలని అలా కాకుండా రోడ్డుపై వేయరాదనితెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవడం ద్వారా రోగాలను నివారించవచ్చని తెలిపారు. ఈ ర్యాలీలోఆరోగ్య కార్యకర్త హరిత, పంచాయితీ సిబ్బంది పెంచలయ్య, సుదాకర్, శివయ్య గ్రామ వాలంటీర్లు వున్నారు.

## సరదాగా షికారుకు వచ్చి నీటి గుండంలో యువకుని గల్లంతు

**రాపూరు,అక్టోబరు1ప్రభాతవార్త** ఆదివారం సరదాగా గడుపుదామని స్నేహి తులతో కలసి షికారుకు వచ్చి నీటి గుండంలో పడి యువకుడు గల్లంతైన సంఘటన ఆదివారం రాపూరు..చిట్వేలి ఘాట్ రోడ్డులోని సిద్దిలేశ్వర కోనలో జరిగింది. నెల్లూరు జిల్లా కావలికి సమీపంలోని ఇసకపల్లి గ్రామానికి చెందిన పి.మనోజ్ కుమార్(21),ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్నా డు.తన స్నేహితులు 13 మందితో కలసి మొత్తం 14 మంది సరదగా గడిపేందుకు సిద్దిలేశ్వర కోనకు వద్దకు చేరుకున్నారుస్నేహితులు సరదాగా వున్న కాసేపటికి వారి స్నేహితుడు మనోజ్ కుమార్ కనిపించక పోవడంతో అక్కడ వున్న నీటి గుండంలో గల్లంతై వుంటాడని భావించి రాపూరు పోలీసులకు సమచారం అందించారు. సమాచారం అందుకున్నరాపూరు సర్కిల్ ఇనస్పెక్టర్ సుబ్రమణ్యం, ఎస్ఐ మాల్యాద్రిలు హుటాహుటిని సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికిచేరుకోని గజ ఈతగాళ్లతో నీటి గుండంలో గాలింపు చర్యలు చేపట్టారు. అయితే దట్టమైన అడవి కావడంతో సాయంత్రానికిచికట్లు కమ్ముకున్నాయి. దీంతో గాలింపు చర్యలకు అంతరాయం ఏర్పడింది. తిరిగి సోమవారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు.





## అవినీతిలో అగ్రస్థానం వైసిపిదే



**కావలి, అక్టోబరు 1 ప్రభాతవార్త** అవినీతిలో అగ్రస్థానం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీదేనని తెలుగుదేశం పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా మాలేపాటి ఆధ్వర్యంలో చేపట్టిన రిలేనిరాహార దీక్షలు ఆదివారం నాటికి 18వ రోజుకు చేరుకున్నాయి. కావలి నియోజకవర్గంలోని టిడిపి నాయకులతో కలిసి మాలేపాటి దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాలేపాటి సుబ్బానాయుడు మాట్లాడారు. చంద్రబాబునాయుడుని ఈ రోజుకు 23 రోజులుగా జైలులో వుంచారన్నారు. తాము 18 రోజులుగా శాంతియుతంగా రిలేనిరాహార దీక్షలు చేస్తున్నామన్నారు. కక్ష సాధింపుతోనే ఈ ప్రభుత్వం వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ప్రతి ఒక్కరు చంద్రబాబుని అరెస్ట్ చేసిన విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారన్నారు. జగన్మోహన్‌రెడ్డి కావాలని చంద్రబాబుపై పగబట్టి జైలుకు పంపారనే భావన ప్రజల్లో వుందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేతగాని పరిపాలనను, సైకో మనస్తత్వాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. నిన్నటి రోజున తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుల్లో చిన్నపాటి కలహం ఏర్పడిందని తెలిపారు. కుటుంబ అన్న తర్వాత కలహాలు సహజమని తెలిపారు. తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ కలిగిన పార్టీ అన్నారు. తమ పార్టీ కుటుంబ సభ్యులందరూ సమిష్టిగా వున్నారని తెలిపారు. కావలి పట్టణ ప్రజలు తెలుగుదేశం పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ఖచ్చితంగా కావలిలో తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలాడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమాజాన్ని స్వచ్ఛత వైపు నడిపించేలా సమిష్టి కృషి అవసరం



**కోవూరు, అక్టోబర్1 ప్రభాతవార్త :** గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ పరిసరాల పరిశుభ్రత పాటించి గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా మారేందుకు సమిష్టి కృషి అవసరమని రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు డి. నిరంజన్‌బాబురెడ్డి పేర్కొన్నారు. కోవూరులోని మండల పరిషత్ తాలూకా ఆఫీస్ ప్రాంగణంలో ఆదివారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు స్వచ్ఛ హీ సేవా కార్యక్రమాన్ని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నేతలు, పొదుపు గ్రూపు మహిళలు, వివిధ శాఖల అధికారులు స్వచ్ఛంద నరశమదానం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరా పరిశుభ్రతకు అత్యంత ప్రధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని కేవలం ఈ రోజే కాకుండా ఒక యజ్ఞంలా చేపట్టాలని కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గ్రామాలన్నీ స్వచ్ఛ గ్రామాలుగా యారాలన్నదే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీహరి, మండల పరిసత్ అధ్యక్షురాలు టి. పార్వతి, ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, గ్రామ సర్పంచ్ వై. విజయ, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, నేతలు అనూప్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, శివకోటారెడ్డి, వెలుగు ఏపీఎం వెంకటస్వామి, సీసీలు రాము, వసంత, పొదుపు మహిళలు ఉన్నారు.

## కష్ట పడి కాకుండా ఇష్టపడి చదవాలి



**కోవూరు, అక్టోబర్1 ప్రభాతవార్త :** వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ప్రభుత్వం ఇస్తున్న అవకాశాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించే దిశగా ముందుకు సాగాలని ఎంపీపీ టి. పార్వతి పేర్కొన్నారు. కోవూరులోని సాంఘిక సంక్షేమ వసతి గృహ సముదాయంలో ఆదివారం విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలతో పాటు వసతి గృహాల్లో కూడా ప్రత్యేక మెనూను ఏర్పాటు చేశారని, దీనిని పూర్తిస్థాయిలో విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు కె. శ్రీలత మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో పనిచేస్తున్న సంక్షేమాధికారులు విద్యార్థుల పట్ల చూపిస్తున్న ప్రత్యేక చొరవను అభినందిస్తున్నామన్నారు. రానున్న 10వ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. పచ్చదనం పరిశుభ్రతపై ప్రాథమిక దశ నుంచి విద్యార్థులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూ తిరుపతయ్య పలు సూచనలు చేశారు. అనంతరం ఎంపీపీ, జెడ్పీటీసీలను సాంఘిక సంక్షేమ ఆధ్వర్యంలో శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమాధికారులు వెంకట్రావు, నాగరాజు, పద్మ, మేరీ సుప్రజ, తదితరులు ఉన్నారు.

## స్వచ్ఛ గ్రామాలకు ప్రజలు సహకరించాలి



**కోవూరు, అక్టోబర్1 ప్రభాతవార్త :** గ్రామాలు స్వచ్ఛ గ్రామాలుగా మారేందుకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని గంగవరం గ్రామ సర్పంచ్ లక్ష్మికుమారి తెలిపారు. కోవూరు మండలం గంగవరం గ్రామ పంచాయతీలో ఆదివారం స్వచ్ఛత హీ సేవ సందర్భంగా గ్రామాల్లోని వీధులను పరిశుభ్రం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్తా చెదారాలను గ్రామస్తులు ఎక్కడంటే అక్కడ పడవేయకుండా పంచాయతీ ఏర్పాటు చేసిన చెత్త కుండీలను ఉపయోగించాలన్నారు. అదేవిధంగా పంచాయతీకి చెల్లించాల్సిన పన్నులను సకాలంలో చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలన్నారు. అనంతరం వీధులను శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంపీటీసీ సభ్యురాలు సు మిత్రమ్మ, ఉప సర్పంచ్ జి. మోషా, పంచాయతీ కార్యదర్శి జి. కరుణకుమారి, కోవూరు మండల వైసీపీ మహిళా అధ్యక్షురాలు జ్యోతి, గీతాంజలి కళాశాల విద్యార్థిని, విద్యార్థులు అంగన్‌వాడీ , ఆశా కార్యకర్తలు, గ్రీన్ అంబాసిడర్లు ఉన్నారు.

## సీనియర్ సిటిజన్స్‌కు ఘన సన్మానం



**కోవూరు అక్టోబరు 1 ప్రభాతవార్త :** ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కోవూరులోని గ్రామ సచివాలయ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం 80 సంవత్సరాలు దాటిన సీనియర్ సిటిజన్లను కోవూరు తహసీల్దార్ పద్మజ శాలువా, పూలమాల, ప్రశంసాపత్రాలతో ఘనంగా సత్కరించి సన్మానం చేశారు. ఇటువంటి వృద్ధులను సన్మానించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అంతకుముందు గ్రామంలో సీనియర్ సిటిజన్స్ ఇళ్లకు వెళ్లి ఇళ్లలోనే వారికి శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమణయ్య, సీనియర్ అసిస్టెంట్ కిరణ్, సుధా, వీఆర్ఏలు ఉన్నారు.

## పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలి



**కోవూరు, అక్టోబర్1 ప్రభాతవార్త :** విద్యార్థులు ప్రాథమిక దశ నుంచి వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై కూడా మరింత అవగాహన చేసుకోవాలని కోవూరు ఏఎస్‌డబ్ల్యూ పి. తిరుపతయ్య సూచించారు. కోవూరులోని సాంఘిక సంక్షేమ వసతి గృహ సముదాయంలో ఆదివారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ టి. పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలతల సహకారంతో పరిసరాలను పరిశుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. వసతి గృహ సంక్షేమాధికారులు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## గృహ సారథులకు ఇన్సూరెన్స్‌పై అవగాహన



**కోవూరు, అక్టోబర్1 ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు గ్రామ సచివాలయంలో ఆదివారం సచివాలయ కన్వీనర్లు గృహ సారథులకు ఇన్సూరెన్స్ నమోదు కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల జేసీసీ కన్వీనర్ ప్రసాద్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీకి సారథులైన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా భరోసా కల్పిస్తూ వారందరికీ జీవిత భీమా కల్పించడం మంచి శుభపరిణామం అన్నారు. ఈ జీవిత భీమా సౌకర్యాన్ని మండలంలోని ప్రతి సచివాలయకన్వీనర్, గృహసారథులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో వివేకా యువజన సంఘం అధ్యక్షుడు వైసీపీ నేత మారంరెడ్డి వంశీధర్‌రెడ్డి, వి. శ్రీనివాసులురెడ్డి, పి. సుధీర్‌రెడ్డి, ఎం. అమరనాథ్‌రెడ్డి, పి. విజయ్‌కుమార్, డి. వెంకటేశ్వర్లు,. ఉన్నారు.

## కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష




**కోవూరు, అక్టోబర్1 ప్రభాతవార్త :** కోవూరు ఆర్అండ్‌బీ అతిథి గృహ సమీపంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిసూనత కోవూరు టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం 19వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణిగా వ్యవహరిస్తూ నాలుగు సంవత్సరాలుగా కొనసాగుతున్న కేసుకు సంబంధించి ప్రస్తుతం మాజీ ముఖ్యమంత్రిని అరెస్టు చేయడం ఎంతవరకు సబబన్నారు. ప్రజల్లో టీడీపీకి వస్తున్న ఆదరణనుచూసి ఓర్చుకోలేక ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమానికి పూనుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఎన్ని కార్యమ్రాలు చేపట్టినా రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఆదివారందీక్షలో అశోక్‌రెడ్డి,, సీహెచ్ పెంచలయ్య, అశోక్‌కుమార్, లే గుంటపాడు సర్పంచ్ రాజగోపాల్‌రెడ్డి, శ్రీకర్‌రెడ్డి, వీరేంద్ర నాయుడు, నాటకరాణి వెంకట్ , మహేష్,, టవి కుమార్, బాలరవి, , మల్లారెడ్డి, నాగరాజు, రమేష్ యాదవ్, మురళి, అమరేంద్రరెడ్డి, గోవిందుర్, ప్రసాద్, రవి, నాగేశ్వరరావు తదితరులు ఉన్నార్డ్డి,

## నాగదేవత ప్రత్యేక పూజలు చేసిన సుబ్బారావు



**నెల్లూరు అక్టోబర్ 1, ప్రభాతవార్త-వైద్యం** చంద్రబాబునాయుడు త్వరగా జైలు నుండి విడుదల కావాలని నగరంలోని పరమేశ్వరి నగర్‌లో ఉన్న నాగుళ్ళ పరమేశ్వరి ఆలయంలో చంద్రబాబు పేరు మీద ఆదివారం నాగదేవతకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీసెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు పాలాభిషేకం చేసి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ధర్మవరం మాట్లాడుతూ బాబు వెంటనే విడుదలై ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆయన ఆకాంక్షించారు. నాగదేవత అనుగ్రహం ఎల్లవేళలా ఆయన మీద ప్రజలకు నిరంతరం సేవ చేస్తూ నిండు నూరేళ్ళు జీవించాలని ఆయన ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. చంద్రబాబు అక్రమంగా అరెస్టు చేసి జగన్‌మోహన్‌రెడ్డి పైశాచిక ఆనందాన్ని పొందుతున్నాడన్నారు. వైసీపీ నేతల ఆగడాలతో సామాన్యుల పరిస్థితి రోజురోజుకి దిగజారిపోతోందన్నారు. వైసీపీ నాయకులు చేస్తున్న దమనకాండకి ప్రజలు భయభ్రాంతులకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ పూజా కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ధర్మవరం సుజతారావు, డాక్టర్ ధర్మవరం గణేష్‌కుమార్, కల్వకుంట భాస్కర్, పద్మాబాయి, అద్దంకి చంద్ర, మన్నార్‌స్వామి, వీరమల్లు చంద్ర, సుదా, మదనంబేటి మునిశేఖర్, కంచి క్రిష్ణ, సాయిక్రిష్ణ, చిన్నబ్బాయియాదవ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## రవాణా రంగంలో పనిచేసే కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



**కావలి రూరల్, అక్టోబరు 1 ప్రభాతవార్త** రవాణా రంగంలో పనిచేసే కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.సురేష్ డిమాండ్ చేశారు. ట్రాన్స్‌పోర్టు రంగంలో పనిచేసే కార్మికులు, ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ప్రచార జీపు జాత ఆదివారం కావలి పట్టణానికి చేరింది. ఈ సందర్భంగా తుమ్మలపెంట బస్టాండ్ ఆటో స్టాండ్ దగ్గర జరిగిన కార్యక్రమంలో సురేష్ మాట్లాడారు. జీవో నెంబరు 21 ఉపసంహరించుకోవాలని, పెంచిన త్రైమాసిక ఆర్టీవో చలానా చార్జీలను తగ్గించాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించాలి, ఆటో కార్మికులపై విధిస్తున్న పోలీస్ ఈచలానాలు రద్దు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగ కార్మికుల హక్కులను, ప్రయోజనాలను కాపాడేందుకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 6వ తేదిన దేశ వ్యాప్తంగా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేష న్(ఏఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) ఆందోళనకు పిలుపునిచ్చిందని తెలిపారు. అందులో భాగంగా 6వ తేది విజయవాడలో జరిగే మహాధర్నాలో ఆటో కార్మికులు, ట్రాన్స్‌పోర్టు రంగంలో పనిచేసే కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలో వున్న బిజెపి ప్రభుత్వం 2019 సంవత్సరంలో మోటార్ వెహికల్ సవరణ చట్టాన్ని తీసుకొచ్చి కార్మిక రంగంపై విపరీతమైన భారం మోపిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక పాలన సాగిస్తుందన్నారు. అనేక కార్మిక చట్టాలను మార్పు చేస్తూ కార్మిక రంగాన్ని దెబ్బతీస్తుందని తీవ్రంగా విమర్శించారు. దీనివల్ల మన రాష్ట్రంలో కూడా ట్రాన్స్‌పోర్టు రంగంలో పనిచేసే కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా ఆటో కార్మికులు ఆటోలు నడపలేని పరిస్థితులలో వున్నారన్నారు. ఆటో కార్మికులపై మన రాష్ట్ర ప్రభుత్వం రకరకాల టాక్స్‌ల పేరుతో దోపిడీ చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ఆటో కార్మిక కుటుంబాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే దానికంటే తీసుకునేదే చాలా ఎక్కువగా వుందని ఇది చాలా దారుణమైన విషయమన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి కార్మిక రంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎన్.వి.రాజు, జిల్లా కమిటీ సభ్యులు షానవాజ్, సుధాకర్, ఎన్.సురేష్, పురుషోత్తం, స్థానిక సిఐటియు నాయకులు ఎస్.కె.అబీర్‌బాష, బోగిశెట్టి కిష్టయ్య, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## స్వచ్ఛమైన జీవన శైలినీ అలవర్చుకోవాలి



**దుత్తలూరు(వరికుంటపాడు), అక్టోబర్ 1, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ స్వచ్ఛమైన జీవన శైలినీ అలవర్చుకోని, పరిసీరాల పరిశుభ్రతను పాటించాలనీ బ్రహ్మేశ్వరం గ్రామ సర్పంచ్ మీసాల సుబ్బారాయుడు యాదవ్ అన్నారు. స్వచ్ఛత కోసం శ్రమదాన్ కార్యక్రమములో భాగంగా మండలంలోని బ్రహ్మేశ్వరం గ్రామం లో సర్పంచ్ మీసాల సుబ్బారాయుడు యాదవ్ ఆధ్వర్యంలో గ్రా మంలో శ్రమదానం నిర్వహించారు. వీధి వీధి తిరుగుతూ పరిస రాలలో ఉన్న చెత్త ను ఏరడమే కాకుండా ,ఆయనే స్వయంగా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 1 వ తేది స్వచ్ఛత శ్రమదాన్ కోసం మాతో చేరండి అంటూ పరిసరాల పరిశుభ్రతతో పాటు ,వ్యక్తి గత శుభ్రత పై అవగాహన కల్పిం చామన్నారు. ఈ కార్యక్రమములో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని, గ్రామంలో పరిశభ్రవాతావరణాన్ని నిర్మించడంలో భాగస్వామ్యులు కావాలనీ పిలుపునిచ్చారు. స్వచ్ఛమైన గ్రామంగా బ్రహ్మేశ్వరం గ్రామం నిలిచి, అందరికి ఆదర్శంగా నిలిచేందుకు కృషి చేస్తానన్నారు. పంచాయతీ కార్యదర్శి పి.హరికృష్ణ ,వార్డు సభ్యులు, వాలంటీర్లు, వెలుగు సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, గ్రామంలోని యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

## దిశ ప్రొటెక్షన్ వెల్‌ఫేర్ ఫౌండేషన్ నుంచి అరుణను తొలగించాం



**నెల్లూరుటౌన్, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** దిశ ప్రొటెక్షన్ వెల్‌ఫేర్ ఫౌండేషన్ నుంచి అరుణను తొలగించడం జరిగిందని ఆ ఫౌండేషన్ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం నెల్లూరు నగరంలోని అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పలువురు అరుణపై ఫిర్యాదులు చేయడంతో తాము విచారించి ఫౌండేషన్ నుంచి తప్పించడం జరిగిందన్నారు. దిశ ప్రొటెక్షన్ వెల్‌ఫేర్ ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న అరుణను ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాజు ఆమెను బాధ్యతల నుంచి తొలగించారు. ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రోజారాణి మాట్లాడుతూ 1996 నుండి ప్రజాసేవలో భాగంగా వివిధ సేవా కార్యక్రమాలు చేస్తున్నామని ఎప్పుడు ఆమెలాగా ప్రజలను మోసం చేయడం అన్యాయంగా దోచుకోవడం చేయలేదన్నారు. ఈ సమావేశంలో దిశ ప్రొటెక్షన్ వెల్‌ఫేర్ ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విమలమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి సోను, రూరల్ ప్రెసిడెంట్ హుస్సేన్ బి తదితరులు పాల్గొన్నారు.

## వన్‌స్టాప్ సెంటర్ (సఖి) లో శ్రమదానం



నెల్లూరుటౌన్, అక్టోబర్ 1, ప్రభాతవార్త: మహాత్మాగాంధీ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరంలోని వన్‌స్టాప్ సెంటర్ (సఖి) లో స్వచ్ఛత హై సేవ - 2023 కార్యక్రమంలో భాగంగా శ్రమదానం కార్యక్రమం నిర్వహించినట్లు వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ షేక్ సహనాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశుభ్రతకు ఒక గంట శ్రమదానం, ప్రతిజ్ఞ కార్యక్రమం ప్రారంభించామన్నారు. వన్‌స్టాప్ ఆవరణతో పాటు పరిసర ప్రాంతాలను కూడా శుభ్రం చేసి చెత్తను ఒక చోట పోగు చేసి తొలగించడం జరిగిందన్నారు. తమ ఆవరణ పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు సమీపావరణాలను కూడా పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీయస్ జిల్లా ప్రైవేట్ డైరెక్టర్ బి.హేనసుజన, సీడీపీవో అనురాధ, కౌన్సిలర్ కమల, సఖి సిబ్బంది, జిల్లా బాలల సంరక్షణ అధికారి బి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల్ని ఎల్లవేళలా గౌరవించాలి



**కావలి, అక్టోబరు 1 ప్రభాతవార్త** వయో వృద్ధాప్యం అనేది జీవితంలో ఒక భాగం మాత్రమేనని అది శాపం కాదని ప్రతి ఒక్కరు వృద్ధులను గౌరవించాలని కావలి ఆర్డీవో శీనానాయక్ తెలిపారు. కావలి వాయునందన ప్రెస్‌వీధిలోని శ్రీనివాస కళ్యాణమండపంలో ఆదివారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఎల్డర్స్ క్లబ్ అధ్యక్షులు జెబియం నాయుడు అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కావలి మాజీ మున్సిపల్ చైర్మన్, ప్రముఖ సర్జన్ డాక్టర్ ఎన్.ప్రభాకర్‌నాయుడు,విశ్రాంత తహశీల్దార్ బత్తుల కొండయ్య, క్లబ్ గౌరవాధ్యక్షులు దుగ్గిశెట్టి బాలయ్యలను ముఖ్యఅతిధిగా విచ్చేసిన ఆర్డీవో శీనానాయక్ దుశ్శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. సంయుక్త నృత్య కళాశాల నాట్యగురువు లిఖిత ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన నిర్వహించారు. కావలి ఘంటసాల ఎస్.రామచంద్రయ్య, క్లబ్ నిర్వాహకురాలు టి.విద్యావతిలు న్యాయనిర్ణేతలుగా పాటల పోటీలు నిర్వహించారు.పాటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సంయుక్త నృత్య కళాశాల నృత్య కళాకారులకు ఆర్డీవో శీనానాయక్ బహుమతులు ప్రదానం చేశారు. ఎల్డర్స్ క్లబ్ నిర్వాహకులు ఆర్డీవో శీనానాయక్‌ను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆర్డీవో శీనానాయక్ మాట్లాడారు. వృద్ధులైన తల్లిదండ్రుల సంక్షేమ బాధ్యతలను సంతానం మరిచి పోరాదని లేకుంటే చట్టపరమైన చర్యలు వుంటాయని హెచ్చరించారు. ఎల్డర్స్ క్లబ్ తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి తాను ఎల్లవేళలా సిద్ధమేనన్నారు. ఓల్డేజ్ క్లబ్ స్థాపనకు ప్రయత్నిస్తున్న క్లబ్ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. వృద్ధుల అనుభవాలు సమాజానికి, ప్రస్తుత తరానికి శాశ్వితమైన పుస్త కాలవంటివని తెలిపారు. తన వద్దకు పనులపై వచ్చే వయో వృద్ధులకు తాను ప్రాధాన్యతనిస్తానని తెలిపారు. డాక్టర్ ఎన్.ప్రభాకర్‌నాయుడు మాట్లాడుతూ తన వద్దకు వైద్యం కోసం వచ్చే వయో వృద్ధులకు ఎల్లవేళలా ఉచితంగా వైద్య సేవలందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మాధవరెడ్డి, క్లబ్ ఉపాధ్యక్షురాలు సి.శారద, కె.గోపాలకృష్ణ, రావి కోటిరెడ్డి, వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షులు ఎస్.కె.ఖాదర్‌బాషా, ఎల్డర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# ఓటమి భయంతోనే చంద్రబాబు అరెస్టు



**నెల్లూరు సెప్టెంబర్ 1, ప్రభాతవార్త–వైద్యం** రానున్న ఎన్నికల్లో వైసీపీ పార్టీ, జగన్‌మోహన్‌రెడ్డి ఓటమి పాలవు అవుతాడనే భయంతోనే టీడీపీ నేత చంద్రబాబునాయుడుని అరెస్టు చేయించాడని తెలుగుదేశం పార్టీ మాజీమంత్రి పొంగూరు నారాయణ ఆరోపించారు. ఆదివారం నగరంలోని 39వ డివిజను పరిధిలోని మూలాపేట రావిచెట్టు సెంట ర్‌లో ఆ డివిజను టీడీపీ ఇన్‌చార్జ్ అన్నంగి ప్రసాద్ ఆధ్వర్యంలో బాబుతో నేను కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు, ఆ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పొంగూరు నారాయణ పాల్గొని ఇంటింటికి తిరుగుతూ చంద్రబాబు నాయుడుని కావాలనే ఎలా స్కిల్ డెవలప్‌మెంటు కేసులో ఇరికించి జైలుకు పంపారో స్థానికులకు సవివరంగా వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ కేవలం రాజకీయ కక్షతోనే ఉద్దేశ్య పూర్వకంగా బాబుని జైలుకు పంపారని మండిపడ్డారు. నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ చెపుతున్న మాటలు పచ్చి అబద్దాలన్నారు. ఆయన చెపుతున్న దాంట్లో వాస్తవాలు లేవన్నారు. నిజాలను కప్పి పుచ్చుతూ అబద్ధాలను నిజాలు చేయాలని చూస్తున్నాడని లేకపోతే రానున్న ఎన్నికల్లో సీటు రాదనే ఆలోచనతోనే ఇలాంటి డ్రామాలు ఆడుతున్నాడన్నారు. వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు దమ్ముంటే స్కిల్ డెవలప్‌మెంటు సెంటర్లకు రావాలని నిజాలు, నిజాలు ప్రజలకు కూడా తెలుస్తాయని సవాల్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మహిళా ప్రధాన కార్యదర్శి ముప్పాళ్ళ విజేతరెడ్డి, పరిశీలకులు కరిముల్లా, తాళ్ళపాక అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన దేశంగా నిలపడంలో ప్రధాని మోడీ కృషి ఎనలేనిది



**కావలి, అక్టోబరు 1 ప్రభాతవార్త** భారతదేశాన్ని ఒక ఆరోగ్యకరమైన దేశంగా నిలపడంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ కృషి ఎనలేనిదని బిజెపి నాయకులు తెలిపారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కమిటీ కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆదేశాలతో కావలి రైతు బజారులో ఆదివారం బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బోర్డు ఆఫ్ ట్రేడ్ మెంబర్, బిజెపి రాష్ట్ర సహ కోశాధికారి కందుకూరి వెంకట సత్యనారాయణ, బిజెపి పట్టణ అధ్యక్షులు కుట్టుబోయిన బ్రహ్మానందంలు మాట్లాడారు. బిజెపి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కావలి రైతు బజారులో ఒక గంట శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. 2014 అక్టోబరు 2వ తేది మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా విస్తరించేలా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఒక జాతీయ ఉద్యమంగా భారత ప్రధాని నరేంద్ర మొదలు పెట్టారన్నారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన భారత్‌ను తయారు చేయాలని మహాత్మా గాంధీ కన్న కలలను నిజం చేసే దిశగా స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇది ఒక జాతీయ ఉద్యమంగా రూపుదిద్దుకుందని తెలిపారు. గతంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించినప్పుడు అనేక మంది ఈ కార్యక్రమాన్ని విమర్శించారన్నారు.భారతీయ కుటుంబాలలో అనేక ఇళ్ళలో సరైన మరుగుదొడ్లు లేని కారణంగా ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలకు పరిష్కార దిశగా ఈ స్వచ్ఛ భారత్ ఉద్యమం ఉపయోగపడిందని తెలిపారు. స్వచ్ఛ భారత్ ఉద్యమం ఘన విజయం సాధించడానికి వ్యక్తులు, సంస్థలు చేసిన కృషిని ప్రధాని నరేంద్ర మోడీ ప్రతి నెల మన్‌కీ భారత్ కార్యక్రమంలో పలుమార్లు ప్రశంసించారన్నారు. పట్టణ ప్రాంతాల్లో స్వచ్ఛభారత్ మిషన్ కింద వ్యక్తిగత మరుగుదొడ్లు, కమ్యూనిటీ టాయిలెట్లు, వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాలపై దృష్టి పెడుతున్నారన్నారు.అనంతరం రైతు బజారులోని పలు సమస్యలపై అక్కడి వ్యాపారస్తులను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి ప్రయత్నిస్తామని వ్యాపారస్తులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు అంచిపాక కమల,వింతా రంగారెడ్డి, సి.వి.సి.సత్యం, మంద కిరణ్‌కుమార్, కోడూరు మురళి, లక్కరాజు భాస్కర్, సుందరశెట్టి సుజి, కేతిరెడ్డి విష్ణుతేజరెడ్డి, మంద శ్రీనివాసులు, కామినేని ఉదయలక్ష్మి, తూమాటి తిరుపతి స్వామి, జలదంకి విజయ్‌కుమార్, మర్రిబోయిన అనిత, కటకం మనోజ్‌కుమార్, ముంగమూరు వెంకట్‌రెడ్డి, పసుపులేటి సుధాకర్, షేక్ మస్తాన్, పోతురాజు వేణు, దేవళ్ల రాకేష్, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

# బుచ్చి నగరపాలక పంచాయితీలో స్వచ్ఛత హిసేవ



**బుచ్చి అక్టోబర్ 1 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగర పాలక పంచాయితీ పరిధిలో 20 వార్డులలో స్వచ్ఛత హిసేవ కార్యక్రమం ఆదివారం చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మురళీ నేతృత్వంలో నిర్వహించారు. నగరపాలక పంచాయితీ కౌన్సిలర్లు, మున్సిఫల్ సిబ్బంది, సచివాలయం సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని వారు నినాదాలు చేశారు. వైస్ చైర్‌పర్సన్,చైర్మన్‌లు ఇంటింటికి వెళ్లి ప్రజలకు పారిశుద్యంపై అవగాహన కల్పించారు. చెత్తను వీధులలో పడవేయకుండా చెత్తబుట్టలో వేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని కోరారు.పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.ఈకార్యక్రమంలో కౌన్సిలర్లు,వైసిపినాయకులు పాల్గొన్నారు.

# ఈనెల 11 నుండి ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి

- ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



**బుచ్చి అక్టోబర్ 1 ప్రభాతవార్త** ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాను సారం ఈనెల 11 నుండి ఎందకు ఆంధ్రాకు జగనే కావాలని అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం వైసిపి పార్టీ కార్యాలయంలో జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతు గతం గడగడపకు మన ప్రభుత్వం కార్యాక్రమం లాగానే ఈకార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం 2 నెలలు ఉంటుందని చెప్పారు.ప్రతి గ్రామంలో ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారు. ప్రతి రోజు ప్రతి గ్రామంలో సచివాలయ ,కన్వీనర్లు,గృహసారుదు లు,ప్రజాప్రతినిదు లు,సచి వాలయం సిబ్బంది, వాలింటర్లు, నాయకులు,కార్యకర్తలు పాల్గొని ప్రతి రోజు ప్రతి గ్రామంలో 15 ఇండ్లకు సందర్శిస్తారు. ఈనెల 12 వతేది ఉదయం నియోజకవర్గంలో ఉదయం 8 గంటలనుండి 9 గంటల మద్యలో జెండా ఆవిష్కరణ ఉంటుందని ఆయన తెలిపారు. చైర్మపర్సన్,కౌన్సిలర్లు అందరు ఈకార్యక్రమంలో పాల్గొని ప్రజలతో మమేకమౌతారని అన్నారు. చంద్రబాబునాయుడుకి తప్పు చేశాడు కాబట్టే రాజమంత్రి జైలులో పెట్టారని ఆయన విమర్శించారు. చంద్రబాబునాయుడు 371 కోట్లు ఆయన కుమారుడు ద్వారా ఆయన ఇం టికి వెళ్లింది. సిఐడి వాళ్ల పూర్తి స్తాయిలో విచారిణ జరిపారు.4 వేల కాపీలతో రిపోర్టు తయారు చేశారు.చట్టం తనన పని తాను చేసుకొని పోతుంది. చంద్రబాబునాయుడ్ని జైలుకు పంపే విషయంలో జగన్ మో హన్‌రెడ్డికి ఎటువంటి సంబంధం లేదు.తెలుగుదేశం నాయకులు, పవన్ కళ్యాణ్,చంద్రబాబు సతీమణి భువనేశ్వరీ రకరకాల వ్యాఖ్యాలు చేస్తు, రకరకాల కార్యక్రమాలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శిం చారు. వైస్‌రాయి హుటల్ ముందు భగవంతుడుతో సమానమైన ఎన్‌టిఆర్‌ని చెప్పులతో కొట్టించిన పాపంఎక్కడికి పోదని అన్నారు.చంద్రబాబునాయుడ్ని జైలులో పెట్టినందుకు ఎన్‌టిఆర్ ఆత్మ శాంతించి ఉంటుందని అన్నారు. చంద్రబాబునాయుడికి ఎన్ని శిక్షలు వేసిన చాలవని అన్నారు. చంద్రబాబునాయుడికి ఉరివేయాలని చెప్పారు. ఈకార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైసిపి నాయకులు డిసిఎంఎస్ చైర్మన్ వీరిచలపతిరావు,దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి,రాష్ట్ర పశుసంవర్ధక శాఖ చైర్మన్ గొల్లపల్లి విజయ్ కుమార్, బుచ్చి మండల నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, నగర అద్యక్షులు టంగుటూరు మల్లికార్జునరెడ్డి,రూరల్ అద్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి, కౌన్సిలర్లు, వైసిపినాయకులు డాక్టర్ అల్లాబక్ష్,ఇన్నమూరి నరసింహరావు,ఎంపిపి మన్నెపల్లి శ్రీనివాసులు,నగరపాలక వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డిలలితారెడ్డి, నియోజకవర్గంలోని వైసిపినాయకులు,కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# గీతామయి వృద్ధుల ఆశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు



**నెల్లూరుటౌన్, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** అంత ర్జాతీయ వృద్ధుల దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం నెల్లూరు భక్తవత్సలనగర్‌లోని గీతా మయుల వృద్ధుల ఆశ్రమంలో నెల్లూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని ఆదేశాల మేంకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కె.వాణి మాట్లాడుతూ వృద్ధుల కోసం ప్రత్యేక చట్టం ఏర్పాటు చేయడం జరిగిందని ఈ చట్టంపై అవగాహన పెంచుకోవాలన్నారు. తల్లిదండ్రుల సంరక్షణ, పోషణ, కుటుంబంలోని వయోవృద్ధులను వృద్ధా ప్యంలో నిర్లక్ష్యం చేయడం హేయకరమైన చర్య అన్నారు. పిల్లలను పెంచి ప్రయోజకులను చేసిన తల్లి దండ్రులను నిర్లక్ష్యం చేయరాదన్నారు. వృద్ధాప్యంలో వారి రక్షణ కోసం 2007 సంవత్సరంలో తల్లిదండ్రుల సీనియర్ సిటిజన్ పోషణ సంక్షేమ చట్టం అమలులోకి వచ్చిందని తెలిపారు. వృద్ధులకు ఎలాంటి అవస రమైన తమ జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమ ఫౌండర్ పాండు తదితరులు పాల్గొన్నారు.

# కడిగిన ముత్యంలా చంద్రబాబు బయటకు వస్తారు



**దుత్తలూరు(వరికుంటపాడు), అక్టోబర్ 1,ప్రభాతవార్త :** నర్రవాడ పేరంటాలు వెంగమాంబ ఆశిస్సులతో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యంలా జైలు నుండి బయటకు వస్తారనీ ఉదయగిరి మాజీ శాసన సభ్యులు బొల్లినేని వెంకటరామారావు అన్నారు. నర్రవాడ వెంగమాంబ ఆలయ ఆవరణలో దుత్తలూరు మండల పార్టీ అధ్యక్షుడు పేలపూడి వెంకటరత్నం ఆధ్వర్యంలో నిర్వహించిన దోష నివారణ హోమంను నిర్వహించారు.ప్రత్యేక యజ్ఞ వాటికలో వేద మంత్రోచ్ఛరణల మధ్య హోమాన్ని నిర్వహించారు. మాజీ శాసన సభ్యులు కంభం విజయరామిరెడ్డి,మాజీ జెడ్పి చైర్మన్ చెంచలబాబు యాదవ్‌లతో కలిసి బొల్లినేని వెంకటరామారావు హోమంలో పాల్గొని,తమ అధినేత త్వరగా జైలు నుండి బయటకు రావాలనీ ఆకాక్షించారు. నేతలు మల్లంపాటి గురవయ్య,మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# భవ్యశ్రీకి న్యాయం చేయకపోతే పోరాటం ఉధృతం చేస్తాం



**కావలి, అక్టోబరు 1 ప్రభాతవార్త** అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన భవ్యశ్రీకి న్యాయం చేయకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని వద్దెర సంఘం నేతలు డిమాండ్ చేశారు. వద్దెర సంఘం ఆధ్వర్యంలో కావలిలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వద్దెర సంఘం జిల్లా అధ్యక్షులు గుంజి గోపి, ప్రధాన కార్యదర్శి గుంజి నరేష్, కావలి నియోజకవర్గ అధ్యక్షుడు చల్లా లక్ష్మీరావు తదితరులు మాట్లాడారు. చిత్తూరు జిల్లా పెనుమూరు గ్రామంలో సెప్టెంబరు 16వ తేది కనిపించకుండా పోయిన వద్దెర కులానికి చెందిన మైనర్ బాలిక భవ్యశ్రీ నాలుగు రోజుల తర్వాత విగతజీవిగా పాడుబడ్డ బావిలో శవమై తేలిందన్నారు. గణేష్ నిమజ్జనంలో భాగంగా విగ్రహాన్ని బావి వద్దకు తీసుకెళ్లగా భవ్యశ్రీ మృతదేహం బయటపడిందన్నారు.భవ్యశ్రీ మృతదేహం అనుమానాస్పద స్థితిలో వుందన్నారు. గుండు చేయించి, కళ్ళు పీకి, అత్యాచారం చేసి బావిలో పడేసి వుంటారని గ్రామస్తులు అనుమానిస్తున్నారన్నారు. ఇంత జరిగినా భవ్యశ్రీ తరపున మాట్లాడే నాయకులు ఒక్కరు కూడా లేకపోవడం బాధాకరమన్నారు. ఆడ బిడ్డను పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారన్నారు. మంత్రి రోజా, వాసిరెడ్డి పద్మలు కూడా ఈ విషయంపై మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. వెంటనే భవ్యశ్రీ కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

# పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ఎంపీలు ఆదాల, వేమిరెడ్డి



**నెల్లూరు సిటీ, అక్టోబరు1 ,ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాజ్యసభ సభ్యులు జిల్లా వైసీపీ అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, లోక్ సభ సభ్యులు, రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సంయుక్తంగా పాల్గొని శంకుస్థాపనలు చేశారు. 41వ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్లో సిమెంటు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఇరుకళల సంఘంలో స్థానిక కార్పొరేటర్ కువ్వాకొల్లు విజయలక్ష్మీ, కువ్వాకొల్లు బాబ్జి యాదవ్‌ల విజ్ఞప్తి మేరకు వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన వీపీఆర్ వాటర్ ప్లాంట్‌ను ఎంపీలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ స్రవంతి, విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నల్లబెలూన్లతో నిరసన



**కలిగిరి, అక్టోబర్1, ప్రబాతవార్త;** స్కిల్ స్కంలో అక్రమంగా చంద్రబాబును జైల్లో పెట్టినందుకు నిరసనగా బొల్లినేని వెంకట రామారావు ఆద్వర్యంలో మహిళలు, టిడిపి నాయకులు నల్లబెలూన్లు ఎగురవేసి తమ వ్యతిరేకతను ప్రదర్శించారు. ఉదయగిరి టిడిపి ఇన్చార్జ్ బొల్లినేని వెంకట రామారావు ఆద్వర్యంలో కలిగిరి మండలం రావులకొల్లులో గ్రామ దేవత శ్రీ సీతాలమ్మ దేవతకు గ్రామస్తులు 101 టెంకాయలు కొట్టారు. అనంతరం వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నల్లబెలూన్లను ఎగురవేశారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో బొల్లినేని వెంకట రామారావు మాట్లాడుతూ మచ్చలేని నాయకుడు నారాచంద్రబాబు నాయుడన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అవినీతిలో కూరుకు పోయి సిబిఐకేసుల్లో కోర్టులచుట్టూ తిరుగుతున్నారన్నారు.అలాంటివ్యక్తి మచ్చలేని చంద్రబాబుపై స్కిల్ డెవలప్ మెంట్లో అవినీతి జరిగిందని జైల్లో పెట్టారన్నారు. జగన్ అవినీతి బురద బాబుకు అంటించాలని చూస్తున్నారన్నారు. ఎవరెన్ని కుయుక్తులు పన్నినా కడిగిన ముత్యంలో బాబు జైలునుండి బయటకు రావడం ఖాయమన్నారు.మీ అవినీతి బయటపెట్టి 2024 లో బాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు.బాబును జైల్లోపెట్టినందుకు ప్రజలు తిరగబడేందుకు సిద్దంగా ఉన్నారన్నారు.ఈ కార్యక్రమంలో రావులకొల్లు సర్పంచి వెంగపనాయుడు, ఏపినాపి సర్పంచి వరప్రసాదు,గంగిరెడ్డిపాళెం సర్పంచి మాదవ, మండల పార్టీ అధ్యక్షులు బిజ్జం క్రిష్ణారెడ్డి,టిడిపి రాష్ట్ర రైతు అద్యక్షులు బివి. రామారావు,పేరేచర్ల సుబ్బారావు,కల్లూరి చంద్రమౌళి, బొగ్గవరపు వేణు పాల్గొన్నారు.

# నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేసిన బొల్లినేని



కలిగిరి, అక్టోబర్01, ప్రభాతవార్త; స్కిల్ స్కాంలో చంద్రబాబును జైల్లో పెట్టినందుకు నిరసనగా గత19రోజులుగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్న కలిగిరి మండల టిడిపి పార్టీ అధ్యక్షులు బిజ్జం క్రిష్ణారెడ్డికి ఆదివారం ఉదయగిరి టిడిపి ఇన్చార్జ్ బొల్లినేని వెంకట రామారావు నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింపజేశారు.ఈ సందర్భంగా బొల్లినేని మాట్లాడుతూ బాబుకోసం నేనుసైతం అంటూ గత 19రోజులుగా ఉదయగిరి నియోజకవర్గంలోని 8మండలాలనుండి టిడిపి నాయకులు, కార్యకర్తలు,అనుబంద సంఘాలు అలుపురగని ధీక్షు చేస్తున్నారన్నారు.వీరికితోడు జనసేన నాయకులుకూడా దీక్షల్లో పాల్గొంటూ సంఘీబావం ప్రకటించారన్నారు.వీరందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. ఎవరెన్ని అడంకులు సృష్టించినా తమ అభిమాన నాయకుడు బయటకు వచ్చేవరకూ అమ పోరాటాలు కొనసాగుతాయన్నారు.పార్టీల కతీతంగా ప్రతి గ్రామంలోనూ బాబుకోసం మేముసైతం అంటూ ముందుకు వస్తున్నారన్నారు. నిన్న నారా లోకేష్‌బాబు, నారా బ్రాహ్మణి ఇచ్చిన పిలుపు మేరకుప్రతి గ్రామంలోనూ తాడేపల్లికి వినపడేలా మోత మోగించారంటే జనం వైసిపి ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకంగా ఉన్నారో అర్దమవుతుందన్నారు.చంద్రబాబు త్వరలో ఈ అక్రమ కేసులనుండి బయటపడి అతి త్వరలో ప్రజలముందుకు వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో చింతంరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, చిన్నసుబ్బారెడ్డి, బివి రామారావు ,జనసేన నాయకులు క్రిష్ణంశెట్టి దిలీఫ్, శీతారాంపురం మండల నాయకులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛభారత్-స్వచ్ఛతహిసేవ



బుచ్చి అక్టోబర్ 1 ప్రభాతవార్త భారత ప్రధాని నరేంద్రమోడి పిలుపు మేరకు బిజెపి మండలా అధ్యక్షులు గండి రఘురామయ్య ఆద్వర్యంలో జాతిపిత మహాత్మగాంధీ జయంతి సందర్భంగా ఆయన ఆశయ సాదనలో నడుస్తు స్వచ్ఛభారత్–స్వచ్ఛతహిసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపిడిఒ కార్యాలయం వద్ద పరిసరాలను శుభ్రపరచడం జరిగింది.ఈ సందర్భంగా రఘురామయ్య మాట్లాడుతు ప్రతి ఒక్కరు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వలన స్వచ్ఛమైన,ఆరోగ్యమైన సమాజాన్ని స్థాపించవచ్చునని అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గోన్న ప్రజలందరికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో బిజెపి ఓబిసి మోర్చ ప్రదానకార్యదర్శి గంజం పెంచల ప్రసాద్, మైనార్టీ మోర్చ జిల్లా ప్రదానకార్యదర్శి షేక్ ఖాదర్‌బాషా, మండల ప్రదానకార్యదర్శి పెజ్జాయి క్రిష్ణారెడ్డి, ఉపాధ్యాక్షులు వన్నెపంట బాలరాఘవరెడ్డి, యువమోర్చ మండల ఉపాధ్యాక్షులు గంజం ప్రదీప్,పెళ్లకూరు సుధీర్ కార్యదర్శులు,పెళ్లూరు జయప్రకాశ్, గంజం సునీల్‌నాయకులు, పాడేటి వెంకటేశ్వర్లు,తదితరులు పాల్గోన్నారు.

# శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో రక్తగ్రూపు నిర్దారణ పరీక్షలు



కావలి రూరల్, అక్టోబరు 1 ప్రభాతవార్త కావలిలోని శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో ఆదివారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా కావలి రెడ్‌క్రాస్ సహకారంతో రక్త గ్రూపు నిర్దారణ పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా రెడ్‌క్రాస్ చైర్మన్ డి.రవిప్రకాష్ పాల్గొని విద్యార్థులకు రక్తదానం యొక్క ఆవశ్యకతను తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.వి.రావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఒక్కరు తమ రక్తగ్రూపు తెలుసుకోవాలన్నారు. అత్యవసర సమయాల్లో తమ రక్తగ్రూపు తెలిసి వుంటే మరొకరికి ఉపయోగపడే అవకాశం వుంటుందన్నారు. యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. కళాశాల డైరెక్టర్ జానకిరాం మాట్లా డుతూ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ద్వారా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు చిన్నవయసు నుంచే సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించడానికి ఇలాంటి కార్యక్రమాలు రానున్న రోజుల్లో ఎన్నో చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో 200 మంది విద్యార్థులు తమ రక్తగ్రూపు తెలుసుకున్నారు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పి.వి.సాయితేజ,ఫిజికల్ డైరెక్టర్ తిరుపాల్,కళాశాల సిబ్బంది, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పెళ్ళికానుక అందజేత



**వింజమూరు అక్టోబరు 1 ప్రభాతవార్త** : వింజమూరు పంచా యతీ పరిధి లోని సుజాతనగర్ కాలనీవాసులు షేక్ సుల్తాన్, హసీనాల కుమార్తె వివాహ సందర్భంగా కాకర్ల చారిటబుల్ టస్ట్ అధినేత కాకర్లసురేష్ ఆదివారం తనవంతు పెళ్ళికానుకగా 10 వేల రూపాయలు అందజేశారు. ఆయన స్వయంగా కాల నీలోని సుల్తాన్,హసీనాల ఇంటికెళ్ళి ఈ నగదును అందజేశారు. షేక్ ఖాజావలి, మల్లినే పవన్, టస్ట్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.